RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 24.7.2024
సంపుటి : 1 | సంచిక : 329 | పేజీలు : 4 | వెల : రూ. 5/-

## యువతకు ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు

### బడ్జెట్‌పై మోదీ



న్యూఢిల్లీ, (**ప్రభాత సూర్యుడు**):కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త పుంతలు తొక్కించే బడ్జెట్ ఇదని, యువతకు ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువత నైపుణ్యాలను పెంచే బడ్జెట్ అని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సాధికారత కల్పించినట్టు చెప్పారు. ''దేశంలోని గ్రామాలు, పేదలు, రైతులను అభ్యుదయ పథంలోకి తీసుకువెళ్లే బడ్జెట్ ఇది. గత పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తు లయ్యారు. మధ్యతరగతి ప్రజానీకానికి కొత్త బలం చేకూరుతుంది. గిరిజన సమాజం, దళితులు, వెనుకబడిన తరగతుల సాధికారతకు కొత్త ప్రణాళికలను బడ్జెట్ తీసుకువచ్చింది'' అని మోదీ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు బడ్జెట్ దోహదపడుతుందని, ముద్ర రుణాలను రూ.20 లక్షలకు పెంచామని, భారత్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తామని అన్నారు. ఉపాధి కల్పన, రైతులు, యువత, మహిళలు, పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమంపై బడ్జెట్ ప్రధానంగా దృష్టి పెట్టిందని చెప్పారు. పన్నుల తగ్గింపు, టీడీఎస్ నిబంధనలను సరళతరం చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. రక్షణరంగం స్వయం సమృద్ధి సాధించేందుకు బడ్జెట్‌లో అనేక ప్రొవిజన్స్ కల్పించామని, పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని మోదీ చెప్పారు.

# యువత, రైతులకు ప్రాధాన్యత



- బంగారు ప్రియులకు గుడ్‌న్యూస్
- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా

న్యూఢిల్లీ,(**ప్రభాత సూర్యుడు**): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 వార్షిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంపై భారతదేశ ప్రజలు విశ్వాసంతో ఉన్నారంటూ నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కొనసాగిస్తూ.. భారతీయులందరికీ భవిష్యత్తుపై భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రపంచ ఆర్థిక స్థితిగతులను పరిశీలించినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ ఊహించినదానికంటే మెరుగ్గా ఉందన్నారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజలకు నేరుగా ప్రయోజనాలు కల్పించే అంశాలు లేనప్పటికి.. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లుగా చెప్పుకోవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**బడ్జెట్‌లో ప్రాధాన్యతలు..**

ఉపాధి, నైపుణ్య శిక్షణ, సూక్ష్మ, చిన్న, మధ్య

2లో

# ఇలాంటి తీర్మానం ప్రవేశ పెట్టాల్సి రావడం బాధాకరం



- సభలో సంతాప సిఎం రేవంత్ సంతాప తీర్మానం
- సాయన్న ఆశయాలను ముందుకు తీసుకు వెళతామని ప్రకటన
- కెటిఆర్, పలువురు మంత్రులు తదితరుల సంతాపం

హైదరాబాద్,(**ప్రభాత సూర్యుడు**): దివంగత ఎమ్మెల్యే లాస్యనందితకు తెలంగాణ శాసనసభ ఘనంగా నివాళి అర్పించింది. బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే.. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపంగా సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇలాంటి బాధాకరమైన తీర్మానం ప్రవేశపెట్టాల్సి వచ్చినందుకు చింతిస్తున్నట్లు చెప్పారు. లాస్య నందిత తండ్రి సాయన్న తనకు అత్యంత సన్నిహితులు, ఆప్తులు. చాలా సంవత్సరాలు మేం కలిసి పనిచేశాం. ఎమ్మెల్యేలుగా ప్రజాక్షేత్రంలో పనిచేశాం. సాయన్న కంటోన్మెంట్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఆయన మరణించడంతో తండ్రి వారసత్వాన్ని, బాధ్యతలను నెరవేర్చేందుకు ఆయన కుమార్తె లాస్య నందిత ప్రజాజీవితంలోకి వచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కంటోన్మెంట్ ప్రజలు, మహిళల తరఫున చిత్తశుద్ధితో పోరాడతారని భావించాం. కానీ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఆమె మరణించారు. తలకు తీవ్ర గాయమై చనిపోయారని వైద్యులు చెప్పారు. ఆ కుటుంబానికి ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. కంటోన్మెంట్

2లో

### కేంద్ర బడ్జెట్‌పై

# రాహుల్ గాంధీ నిప్పులు

### కుర్చీని కాపాడుకోవడానికే!



న్యూఢిల్లీ, (**ప్రభాత సూర్యుడు**):ఆర్థికమంత్రి నిర్మలా సీతా రామన్ మంగళవారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ఇది కుర్చీని కాపాడుకునే బడ్జెట్ అని దుయ్య బట్టారు. ఈ బడ్జెట్ తన మిత్రపక్షాలను సంతోషపెట్టేలా ఉందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలను పణంగా పెట్టి.. బడ్జెట్‌లో తమ మిత్ర పక్షాలకు బూటకపు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. తన స్నేహితులను సంతోషపెట్టడం కోసమే ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారని.. దీని నుంచి (అదానీ, అంబానీ) ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఎప్పట్లాగే ఈసారి కూడా సామాన్య భారతీయుడికి ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. ఇదొక కాపీ పేస్ట్ బడ్జెట్ అని.. కాంగ్రెస్ మేనిఫెస్టో, గత బడ్జెట్‌లను కాపీ కొట్టారని ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఈ బడ్జెట్ మీద విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ తరహాలోనే.. దీనిని ఓ కాపీ పేస్ట్ బడ్జెట్‌గా అభివర్ణించారు. ఈ మోదీ ప్రభుత్వ కాపీక్యాట్ బడ్జెట్.. కాంగ్రెస్ న్యాయ అజెండాను కూడా సరిగ్గా కాపీ చేయలేకపోయిందని ఖర్గే వ్యంగ్యాస్త్రాలు

2లో

## ప్రైవేట్ హాస్టల్‌లో

# గంజాయి స్వాధీనం

### ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల విచారణ

హైదరాబాద్,(**ప్రభాత సూర్యుడు**): ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో చాలా చోట్ల మాదక ద్రవ్యలకు సంబంధించిన అనేక విషయాలను మనం చూస్తూనే ఉన్నాము. ఇకపోతే ఈ మధ్యకాలంలో మత్తు పదార్థాలను కొందరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తూ వారి జీవితాలను సూన్యంలోకి నెట్టేస్తున్నారు. నగరంలో దాదాపు 100కు పైగా ప్రైవేట్ హాస్టల్స్ కొనసాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. టీ స్టాల్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లుగా మాకు తెలిసిందని ఏసిపి కెవిపి రాజు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ హాస్టల్లో రైడ్ చేశామని., గల్లికొక్కటిగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హాస్టల్లో ఇలాంటి కార్యక్రమాలు సాగుతున్నట్లు ఆయన అన్నారు. ఇకపోతే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రవేట్ హాస్టల్ లో విద్యార్థుల వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 6 మంది విద్యార్థులను పట్టుకొని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

## గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నివాళి



హైదరాబాద్,(ప్రభాత సూర్యుడు) :అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్ పార్కు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై తెలంగాణ, జోహర్ తెలంగాణ అమరవీరులకు జోహార్.. జోహార్.. అంటూ నినదించారు. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గన్ పార్కు నుంచి అసెంబ్లీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ నడుచుకుంటూ

2లో

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేదు



హైదరాబాద్, (**ప్రభాత సూర్యుడు**) : కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేదని, రాష్ట్రానికి గుండు సున్న ఇచ్చారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ రోజు (మంగళవారం) హరీష్ రావు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ఏపీకి అన్ని నిధులు ఇచ్చినందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే.. తెలంగాణలో కూడా 9 వెనుకబడిన జిల్లాలు ఉన్నాయని.. వాటికి ఎందుకు

2లో

# సంపాదకీయం

## నియంతల పాలనకు లోక్‌పాల్‌తోనే చెక్ !

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉ ంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలో తప్పులను కప్పి పుచ్చుకునే తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. పేదవాడికి ఓ డబుల్ ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయారు. కొంత వ్యవధి తేడాల ఇద్దరూ విపక్షం లోకి వచ్చారు. ఇప్పుడు కూడా ఈ ఇద్దరి మనస్తత్వం, కార్యక్రమాలు ఒకేరీతిన ఉన్నాయి. మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసినానాయాగీ చేస్తున్నారు. ఎపిలో జగన్ అక్కడంతా అక్రమాలు, అహింస రాజ్యమేలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. 40 రోజుల్లోనే ఏదో జరిగినట్లు నల్లగుడ్డలు కప్పుకుని మొక్కుబడిగా అసెంబ్లీకి రావడం,పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించ డం కూడా జరిగిపోయాయి. తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా ఓ రాయి విసిరారు. అధికారంలో ఉ న్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో అటు కెసిఆర్, ఇటు జగన్ ఇద్దరూ విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లు నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మ విమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో ధర్నాకు దిగడానికి వెళ్లారు. పల్నాడులో జరిగిన ఓ వ్యక్తిగత హత్యను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చేస్తున్న ప్రయత్నంతో ప్రజల్లో భంగపడ్డారు. ఈ హత్యపై గగ్గోలు పెడుతున్న జగన్ సొంత చిన్నాన్న హత్యను పట్టించుకోవడం లేదు. విచారణకు అడుగడు గునా అడ్డు పడ్డారు. వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్ముతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీ తో గెలిచారు. ఇంత జరిగినా జగన్ వైఖరిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. రాజకీయం గా వేసిన తప్పటడుగులను సరిచేసుకోవాలన్న ధ్యాస కానరావడం లేదు. ఇది కెసిఆర్ విషయంలోనూ వర్తిస్తుంది. చేసిన తప్పులను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా నియంతలా వ్యవహరి స్తున్నారు. సభకు హాజరయ్యే విషయంలో కెసిఆర్, జగన్‌ల తీరు ఒకేలా ఉంది.

# యువత, రైతులకు ప్రాధాన్యత

తరహా పరిశ్రమలు, మధ్యతరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి, నైపుణ్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో.. రానున్న రోజుల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ.. ఉన్నత చదువుల కోసం తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీలను బడ్జెట్‌లో ప్రకటించారు. వ్యవసాయంలో ఉత్పాదకత, స్థితిస్థాపకత, ఉపాధి, నైపుణ్యం, తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు.

**పన్నుల శ్లాబుల్లో..**

పన్నుల శ్లాబుల విషయంలో పెద్ద ఊరట లేనప్పటికీ.. స్టాండర్డ్ డిడక్షన్ విషయంలో కొంత ఊరటనిచ్చారు. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలుగా ఉండగా.. ఆ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని 50 శాతం పెంచినట్లయ్యింది. దీంతో రూ.17,500 వరకు పన్ను ఆదా చేసుకోవచ్చని నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

**కొత్త శ్లాబులు ఇలా..**

సున్నా నుంచి రూ.3 లక్షల వరకు పన్ను సున్నా
రూ.3-7 లక్షల వరకు 5 శాతం పన్ను
రూ.7-10 లక్షల వరకు 10 శాతం పన్ను
రూ.10-12 లక్షల వరకు 15 శాతం పన్ను
రూ.12- 15 లక్షల 20 శాతం పన్ను
రూ.15 లక్షల పైన 30 శాతం పన్ను

**బడ్జెట్‌లో మొత్తం..**

కేంద్ర బడ్జెట్ పరిమాణం రూ.48.21 లక్షల కోట్లు
మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు
పన్ను ఆదాయం రూ.28.83 లక్షల కోట్లు
ద్రవ్యలోటు 4.9 శాతంగా (అంచనా)
అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు(అంచనా)

**తగ్గనున్న ధరలు..**

కేంద్రబడ్జెట్‌లో ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపుతో మొబైల్ ఫోన్లు, ఛార్జర్ల ధరలు తగ్గనున్నాయి. బంగారం, వెండితో చేసిన ఆభరణాల ధరలు తగ్గనున్నాయి. తోలుతో చేసిన సామాగ్రి ధరలు తగ్గనున్నాయి. క్యాన్సర్‌కు సంబంధించిన మూడు రకాల ఔషధాలను కస్టమ్ డ్యూటీ ఫ్రీగా ప్రకటించారు. దీంతో మూడు రకాల ఔషధాలు తక్కువ ధరకు లభించనున్నాయి.

**బడ్జెట్‌లో కీలక అంశాలు..**

మహిళలు, బాలికలకు లబ్ధి చేకూర్చే పథకాలకు రూ.3 లక్షల కోట్లకు పైగా నిధుల కేటాయింపు. పారిశ్రమలలో పనిచేసే కార్మికుల కోసం రెంటల్ సిస్టమ్‌లో డార్మిటరీ వసతి సౌకర్యం. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకారం జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చే ప్యాకేజీ. బీహార్‌లో వివిధ రహదారుల ప్రాజెక్టుల కోసం రూ.26,000 కోట్లు కేటాయింపు. పీపీపీ పద్ధతిలో బీహార్ అబివృద్ధికి ఆర్థిక సహాయం. బీహార్‌లో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు. 5 రాష్ట్రాల్లో కొత్త కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ. బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక పథకం. ఈశాన్య రాష్ట్రాల్లో వందకు పైగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ శాఖలు ఏర్పాటు. బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి పూర్వోదయ పథకం అమలు. దేశ సమగ్రాభివృద్ధికి జాతీయ సహకార విధానం. గ్రామీణాభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు కేటాయింపు. ప్రతి సంవత్సరం లక్ష మంది విద్యార్థులకు నేరుగా ఇ-వోచర్లను అందజేయడం ద్వారా మొత్తం రుణంపైమూడు శాతం వడ్డీ రాయితీ. అమృత్‌సర్-కోల్‌కతా ఇండస్ట్రియల్ కారిడార్‌లో, బీహార్‌లోని గయాలో పారిశ్రామిక అభివృద్ధికి పూర్తి సహకారం. రూ.26వేల కోట్ల వ్యయంతో రోడ్‌కనెక్టివిటీ ప్రాజెక్టులు. ఈపీఎఫ్ఓలో రిజిస్టర్ చేసుకున్న లక్ష కంటే తక్కువ జీతం ఉన్న మొదటి సారి ఉద్యోగులకు 3 వాయిదాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద ఒక నెల జీతంలో రూ. 15,000 వరకు ఇవ్వనున్నట్లు ప్రకటన. రొయ్యల పెంపకం, మార్కెటింగ్ కోసం ఆర్థిక సహాయం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి అవకాశాలు వేగవంతంపై ప్రత్యేక దృష్టి.

# ఇలాంటి తీర్మానం ప్రవేశ పెట్టాల్సి రావడం బాధాకరం

ప్రజల హృదయాల్లో సాయన్న, లాస్య నందిత శాశ్వతంగా నిలిచిపోతారు. వారు చేయాలనుకున్న పనులను ఈ ప్రభుత్వం పూర్తిచేస్తుంది. ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటిస్తున్నాను. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని సీఎం రేవంత్ చెప్పారు. ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తెలు మృతిచెందడం చాలా బాధాకరమని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. లాస్య నందిత మృతికి సంతాపంగా శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు. సాయన్న మరణించిన తర్వాత ఆ కుటుంబానికి అండగా ఉంటామని అప్పటి సీఎం కేసీఆర్ సభలో హామీ ఇచ్చారు. దాని ప్రకారం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన కుమార్తె లాస్య నందితకు అవకాశం కల్పించారు. రాజకీయాలకు అతీతంగా అందరితో సాయన్న కలిసి ఉండేవారు. తండ్రి ఆశీస్సులు, పార్టీ అండతో నందిత బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత నల్గొండ జిల్లాలో ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి ప్రమాదం జరిగింది. ఆ సమయంలో లాస్య నందిత తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ తర్వాత ఆమె ఇంట్లో లిఫ్ట్ ప్రమాదం జరిగింది. అక్కడికి కొద్దిరోజులకే ఓఆర్ఆర్‌పై రోడ్డుప్రమాదంలో చనిపోయారు. వరుసగా పగబట్టినట్లే ఈ ఘటనలు జరిగాయి. మంచి వ్యక్తిత్వం, విద్యార్హతలు కలిగిన లాస్య నందిత ప్రజలకు ఎంతో సేవ చేస్తారని భావించాం. ఆ కుటుంబానికి అండగా ఉంటాం అని కేటీఆర్ అన్నారు. కంటోన్మెంట్‌లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత.. తన నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించాలనే తాపత్రయం, తపన ఆమెలో ఉండేదని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ గుర్తు చేశారు. లాస్య నందిత మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. సాయన్న తన నియోజకవర్గం పేరుతోనే పిలవబడేవారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆయన సుపరిచితుడు. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి. ఆయన బిడ్డలు కూడా ఎంతో చురుకుగా ప్రజాక్షేత్రంలో ఉండేవారు. ప్రజల మన్ననలు పొందారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అందరిని ప్రత్యక్షంగా కలిసి, మీ అందరి సహకారం, సూచనలు, సలహాలు కావాలని అడిగేది. నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించాలని తపనతో ఉండేది ఆమె అని వివేకానంద్ గౌడ్ పేర్కొన్నారు. నేను కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు సాయన్న సీనియర్ ఎమ్మెల్యే. హైదరాబాద్ పరిధిలోని మా 15 మంది ఎమ్మెల్యేల్లో వారు సీనియర్. ప్రభుత్వాన్ని ఈ విధంగా ప్రశ్నలు అడగాలి. ప్రజా సమస్యలు ఇలా లేవనెత్తాలని చెప్పి ప్రోత్సహించారు సాయన్న. సాయన్న ఎంతో అండగా ఉండేవారు. తనకు సాయన్న సహకారం అందించినట్లే నందితకు కూడా సహకారం అందించాలని అనుకున్నాం. కానీ ఆమె మరణించడం బాధాకరం. కవాడిగూడ కార్పొరేటర్‌గా గెలిచినప్పుడు కూడా ఆమె 150 మంది కార్పొరేటర్లతో కూడా మంచి పేరు సంపాదించుకున్నారు. జీహెచ్ఎంసీ జనరల్ బాడీ మీటింగ్‌లో కూడా లాస్య నందిత సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె ఎంతో అంకితభావంతో పని చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీ తరపున ఆమె కుటుంబానికి అండగా ఉంటాం అని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మన నుంచి దూరం కావడం బాధాకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికైన లాస్య నందిత మృతి చెందడం బాధాకరం. తన తండ్రి సాయన్న ఆశయాలు నెరవేర్చాలని లాస్య నందిత రాజకీయరంగ ప్రవేశం చేశారు. లాస్యనందిత ప్రజా సేవ చేయాలనే ఆత్రుతతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది.

# విపక్షనేత కెసిఆర్‌కు ఛాంబర్

## స్పీకర్ తీరుపై కెటిఆర్ అసహనం

హైదరాబాద్,(**ప్రభాత సూర్యుడు**):అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేటాయించిన ఛాంబర్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల సందర్భంగా ఇన్నర్ లాబీలోని ఎల్వోపీ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలగించిన విషయం తెలిసిందే. ఔటర్ లాబీలో ఎల్వోపీకి ఛాంబర్ ఏర్పాటు చేశారు. రెండు రూమ్‌లు కలిపి ఒకే రూంగా అసెంబ్లీ సిబ్బంది మార్చేశారు. అయితే రూం మధ్యలో టాయిలెట్ పెట్టి వాడుకోవడానికి అనుకూలంగా లేకుండా చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ అంశాన్ని బీఏసీలో లేవనెత్తాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు కేటీఆర్ సూచించారు. స్పీకర్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేయాలని కేటీఆర్ నిర్ణయించారు

# ప్రభుత్వ కార్యాలయాల భద్రతను పరిశీలించిన సీఐ

పులివెందుల, (**ప్రభాత సూర్యుడు**): పులివెందుల పట్టణం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భద్రతను పట్టణ అర్బన్ ఇంచార్జ్ సీఐ మోహన్ కుమార్ పరిశీలించారు. మదనపల్లి సంఘటన దృష్ట్యా ఉ న్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సీఐ మోహన్ కుమార్ పులివెందుల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, ఖజాన కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలలోని రికార్డుల భద్రత ను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు సలహాలు అందించారు. ఏ కార్యాలయం లో అయిన భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం వుంటే ముందుగానే సమాచారం ఇవ్వాలి అని ఆ కార్యాలయం వద్ద పోలీస్ భద్రతను కల్పించే ఏర్పాట్లు చేస్తామని అధికారులకు తెలిపారు. కార్యాలయాల్లోనీ రికార్డులు ఏమాత్రం తప్పు దోవ పట్టించే విధంగా అధికారులు వ్యవహరించవద్దని బాధ్యతగా వ్యవహరించని అధికారులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అధికారులకు సూచించారు.

# గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నివాళి

వెళ్లారు.అమరవీరులకు నివాళులర్పించిన వారిలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద్ గౌడ్, కాలేరు వెంకటేశ్, గంగుల కమలాకర్, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, అనిల్ జాదవ్, మల్లారెడ్డి, చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేదు

నిధులు విడుదల చేయటం లేదని కేంద్రాన్ని నిలదీశారు. మరోవైపు.. రేవంత్ సర్కార్‌పైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాసన సభ సమయాన్ని కూడా వాళ్ల పథకాల్లాగే ఎత్తేస్తున్నారని దుయ్యబట్టారు. నాలుగు రోజుల్లో బడ్జెట్ సమావేశాలు ముగించాలని చూస్తున్నారని హరీష్ ఎద్దేవా చేశారు. గతంలో వీరే 15 రోజులు అసెంబ్లీ సమావేశాలు ఉండాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నిరుద్యోగుల ఎజెండా పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున తాము అడిగామని.. ఇదే విషయాన్ని తెలంగాణ గవర్నర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఈ గవర్నమెంట్ వచ్చాక దారుణాలు, దొంగతనాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఆరు గ్యారెంటీల మీద చర్చ పెట్టాలని తాము అడిగామని చెప్పారు. రుణమాఫీ మీద మొదటి సంతకం అన్నారని... ఇప్పుడు అందరికీ ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పల్లె ప్రగతి పట్టణ ప్రగతి గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రం మొత్తం విష జ్వరాలు ఉన్నాయన్నారు. లోకల్ సమావేశాలకు ఒక్క రూపాయి ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వటం లేదని.. మొత్తం 9 అంశాల మీద చర్చ పెట్టాలని అడిగామని హరీశ్‌రావు గుర్తుచేశారు.

# కేంద్ర బడ్జెట్‌పై రాహుల్ గాంధీ నిప్పులు

గుప్పించారు. కూటమి భాగస్వాములను మోసం చేసేందుకు, ఎన్డీఏ మనుగడ సాగిచేందుకు మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అరకొర డబ్బులు పంచుతోందని ఆరోపించింది. ఇది దేశ ప్రగతికి ఉద్దేశించిన బడ్జెట్ కాదని.. మోదీ ప్రభుత్వాన్ని కాపాడే బడ్జెట్ అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కూడా ఇదొక కాపీక్యాట్ బడ్జెట్ అని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కాంగ్రెస్ మేనిఫెస్టోని చదివినందుకు నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలను సెటైరికల్ కామెంట్ చేశారు. అప్రెంటిస్‌షిప్ పథకాన్ని కూడా కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 11వ పేజీ నుంచి తీసుకున్నారని అన్నారు.





# ఈ నెల 27 న శ్రీ సత్య సాయి జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపికలు

ధర్మవరం,(ప్రభాత సూర్యుడు): శ్రీ సత్య సాయి జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ (16 ఏళ్ల లోపు బాల బాలికల కు) జిల్లా జట్టు ఎంపికల కోసం ఈనెల 27వ తేదీన ధర్మవరం పట్టణంలో జూనియర్ కళాశాల మైదానం నందు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఇంచార్జ్ జింక ఉదయ్ కిరణ్ తెలిపారు. క్రీడాకారులు 01-04-2008 తర్వాత జన్మించినవారు అర్హులు. ఇతర వివరాలకు 94400 41552 ఫోన్ లో సంప్రదించగలరు.




# చినుకు పడితే చిత్తడేచిత్తడి

ఆత్మకూర్, (ప్రభాత సూర్యుడు): మహానంది మండలం, గాజులపల్లె గ్రామంలోని ఓసి కాలనీ పదవ వార్డులో గత నాలుగు రోజుల కురిసిన వర్షానికి రోడ్లు బుడదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడ స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.వర్షం కురిసినప్పుడు ఆ నీరు ముందుకు సాగే విధంగా, సైడు కాలువలు లేకపోవడంతో, ఆ దారిన నడిచే వృద్ధులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, రోగాల భారిన పడుతున్నామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



# మంత్రాలయం లో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మంత్రాలయం, (ప్రభాత సూర్యుడు):మంత్రాలయం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలను మంత్రాల యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్ లో వైఎస్సార్సీపీ నేత లు జి. భీమారెడ్డి, సి. వి. విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణ సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గారి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి ని గురించి వివరించారు. భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతో వంద సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచ్ ల హెూటల్ పరమేష్, వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, రామాంజనేయులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఓసీ అన్ని కులాల వారు పాల్గొన్నారు.

# మహిళలపై లైంగిక వేధింపుల నివారణ కొరకే పోష్ చట్టం

## "మునిసిపల్ కమీషనర్ రమణారెడ్డి"




పులివెందుల,(ప్రభాత సూర్యుడు): పులి వెందుల పట్టణం లోని మునిసి పల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది కి మంగళవారం పని చేసే చోట మహిళల పట్ల లైంగిక వేధింపుల నివారణ (పోష్ ) చట్టం-2013 పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా హాజరైన మునిసిపల్ కమీషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజం లో ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థ లలో ప్రతి రంగంలోను, ప్రతి కార్యాలయంలోను పురుషులతో పాటు స్త్రీ లు కూడా సమానంగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఒకే కార్యాలయంలో గాని పని చేసే స్థావరంలో గాని ఎక్కడైనా సరే మహిళల పట్ల జరుగుతున్న మానసిక, శారీరక, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఇలాంటి లైంగిక వేధింపులు రోజురోజుకు ఎక్కువ అవుతున్న సందర్భంలో వాటిని నివారించడం కోసం ప్రభుత్వ, ప్రయివేట్ మహిళలు విధులు నిర్వర్తిస్తున్న అన్ని సంస్థ లలోను అంతర్గత కంప్లైంట్ కమిటీ ల ద్వారా కంప్లైంట్ చేయడం తోనే లైంగిక వేధింపులు నివారణ సాధ్యం అని కావున ఈ పోష్ చట్టం పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి పోష్ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు కూడా పని చేసే ప్రతి చోట అంతర్గత కంప్లైంట్ కమిటీ లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ఈ కమిటీ లలో మహిళనే చైర్ పర్సన్ గా ఉంటుంది, మిగతా వారు సభ్యులు గా ఉండాలని, అలాగే జిల్లా కేంద్రం లో లోకల్ కంప్లైంట్ కమిటీ ఉంటుంది అని ఇక్కడ ప్రతి కేసు నమోదు అవుతుంది అని ఈ చట్టం ద్వారా కింది స్థాయిలో నే లైంగిక వేధింపులు అరికట్టెందుకు అవకాశం ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కార్యాలయం సిబ్బంది, అన్ని సచివాలయ సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు పాల్గొన్నారు.

# దొనకొండ లో జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియ విస్తృత పర్యటన



దొనకొండ, (ప్రభాత సూర్యుడు): దొనకొండ లో జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియ, విస్తృత పర్యటనలో భాగంగా దొనకొండ విమానాశ్రయ మును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ జాన్ ఇర్విన్ మరియు దర్శి నియోజకవర్గ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి దొనకొండ తాసిల్దార్ కే సుజాత, మండల అభివృద్ధి అధికారి వసంతరావు నాయక్, అధికారుల సమక్షంలో విమానాశ్రయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు, దొనకొండ లో ముందుగా నాయకులు కలిసి పూలమాలలతో శాలువాలతో స్వాగతం పలికారు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారి మరియు మండల అధికారుల సమక్షంలో దొనకొండ విమానాశ్రయాన్ని సందర్శించడం జరిగింది ఇందులో భాగంగా అధికారులను క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు అర్జీ రూపంలో వినతి పత్రాలను పలు సమస్యలపై ఇవ్వటం జరిగింది. వెంటనే అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించేందుకు దోహదపడాలని తెలియజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయాన్ని సందర్శించడమైనదని ఇందులో భాగంగా విస్తీర్ణం వివరాలు అభివృద్ధి చేసేందుకు అనుగుణంగా ఉంటుందా అనే అంశంపై సాధారణ విసిటింగ్ లో భాగంగా దొనకొండ కు రావటం జరిగిందని అయితే అధికారుల సమక్షంలో వివరాల అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, మండల తాహసిల్దార్ కే, సుజాత, మండల అభివృద్ధి అధికారి వసంతరావు నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొనడం జరిగింది.

# దివ్యాంగులకు ట్రై సైకిల్స్, చంకా కర్రలు. చెవిటి మిషన్లో, వీల్ చైర్స్, పరికరాలు వికలాంగులకు అందించుట







ఆత్మకూర్,(ప్రభాత సూర్యుడు) : నంద్యాల జిల్లా నంద్యాల మండలం బిళ్ళలాపురం గ్రామం లో డిస్ట్రిక్ట్ దిశబ్లెడ్ రెహబిలిటేషన్ సెంటర్ ప్రాజెక్ట్ మేనేజర్ కె. ఇస్మాయిల్ గారి ఆదేశాల మేరకు వికలాంగుల గుర్తింపునకు సర్వే నిర్వహించడం జరిగినది. ఈ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశం దివ్యంగులకు సహాయ పరికరాల అవసరాన్ని అంచనావేసి, దివ్యంగుల కు కావలసిన, ట్రై సైకిల్స్, చంకా కర్రలు, చెవిటి మిస్సిషన్, వీల్ చైర్స్ లాంటి పరికరాలు వికలాంగులకు అందించడం జరుగుతుంది. డి డి ఆర్ సి ఫిజియో తేరపిస్ట్ అరుణ సుష్మ గారు, స్పెషల్ ఎడ్యుకేటర్ శ్రావణి రెడ్డి గారు మాట్లాడుతూ.....నంద్యాల జిల్లా వాపత్యంగా వికలాంగుల కోసం పని చేసే సమస్థల సహకరొంతో వికలాంగులందరికి పరికరాలు ఉపాధి కల్పనా, ఫిజియో తిరపీ, వికలాంగుల తల్లిఫండ్రులకు కౌన్సిలింగ్, ఉపకార వేతనాలను అర్హులైన దివ్యంగుల కు అందిస్తామని తెలపండి జరిగింది.



# భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన స్టేట్ సమగ్ర శిక్ష ట్రైనింగ్ అధికారిణి

వేంపల్లి, (ప్రభాత సూర్యుడు): స్టేట్ సమగ్ర శిక్ష ట్రైనింగ్ అండ్ ప్రోగ్రాం అధికారిణి కల్పన శైల మంగళవారం వేంపల్లి భవిత కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మొదట పాఠశాల లోని దివ్యా%శీ%గ చిన్నారులతో తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలు చక్కగా ఉన్నారని దాతల ద్వారా చక్కగా పాఠశాల నిర్వహిస్తున్నారని కితాబు ఇచ్చారు. అనంతరం పాఠశాలలోని రికార్డ్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మొత్తం పరిశీలించారు. పిల్లలకు ఏ విధంగా మెటీరియల్ ఉపయోగించి టీచింగ్ చెబుతున్నారో ఐ.ఈ.ఆర్.టి. లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కేశవరెడ్డి అసిస్టెంట్ కోఆర్డినేటర్ రమణమూర్తి ఎంఈఓ 1 జాఫర్ సాదిక్, ఎంఈఓ 2 స్టాలిన్ ఐజాక్, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

# వేతన జీవులను నిరాశపరిచిన కొత్త బడ్జెట్

## -ఎస్టీయూ రాష్ట్ర మాజీ సోషల్ మీడియా కన్వీనర్&రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్



ఆదోని, (ప్రభాత సూర్యుడు): పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు లు చేయకుండా, కొత్త పనుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని, సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం పై పల్లెత్తుమాట బడ్జెట్ లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు . ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి రావడంతో ఉద్యోగుల పాత విధానానికి మొగ్గు చూపుతున్నారు.. ఈ సారి అయినా పాత విధానంలో పన్నులు చెల్లించేసవారికి రాయితీ ఇస్తారని అందరూ ఆశించారు. కానీ ,వారికి నిరాశనే మిగులుస్తూ మరోసారి కొత్త పనులు విధానానికి రాయితీలు ప్రకటించడం ఉద్యోగులకు నిరాశ కలిగించింది... ఇప్పటికైనా మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరణ చేసే దానిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి . పాత పన్నుల విధానంలో ఏడు లక్షల వరకు ఇలాంటి పనులు లేకుండా మినహాయింపు ఇచ్చే విధంగా పన్నులు స్లాబ్ విధానాన్ని సవరించాలని ,కనీసం లక్ష రూపాయలు స్టాండర్డ్ డిటేక్షన్ మినహాయింపు ఉండాలని కోరారు...అలాగ్ విద్యా రంగానికి బడ్జెట్ లో 6% కేటాయించాల్సి ఉండగా,ప్రస్తుత బడ్జెట్ లో 3.25% నిధులను కేటాయించారు అని విద్యా రంగానికి 6% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు

# పేకాటరాయుళ్ళపై చర్యలు

కొలిమిగుండ్ల, (ప్రభాత సూర్యుడు): సోమవారం కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డి తన సిబ్బందితో కలసి కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మానాయునిపేట పేట గ్రామంలో కుంట వద్ద బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకొని వారి వద్ద ఉన్న 12430/ రూపాయల నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినారు.అలాగే మంగళవారం కూడా తన సిబ్బంది తో కలసి కొలిమిగుండ్ల మండలంలోని కోటపాడు గ్రామంలో నీళ్ల ట్యాంక్ వద్ద బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 5 మందిని పట్టుకొని వారి వద్ద ఉన్న 6900/- రూపాయలు సీజ్ చేసి కేసు నమోదు చేసినారు.




# ఆదాయపు పన్ను చట్టంపై బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం

**ఖమ్మం,(ప్రభాత సూర్యుడు):** ఆదాయపు పన్ను చట్టంపై బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదాయపు పన్ను కార్యాలయం, ఖమ్మం నిర్వహించింది. ఈ సందర్భంగా, ఆదాయపు పన్ను అధికారి, ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, రిటర్న్‌ను దాఖలు చేయడానికి ముందు, ఎఐఎస్ /26 ఏఎస్/ ఫామ్-16 లో అందుబాటులో ఉన్న మొత్తం సమాచారాన్ని సరిచూసుకోవాలని మరియు గడువు తేదీకి ముందే ఫైల్ చేయాలని ఉద్యోగులను అభ్యర్థించారు. ఆదాయానికి సంబంధించిన ఖచ్చితమైన వివరాలను దాఖలు చేయాలని మరియు నిజమైన తగ్గింపులు/మినహాయింపులను క్లెయిమ్ చేయాలని ఆయన ఉద్యోగులకు చెప్పారు. ఇది ఆదాయపు పన్ను శాఖ నుండి స్క్రూటినీ నోటీసులను నివారిస్తుందని చెప్పారు. ఒకవేళ బోగస్ రీఫండ్‌లను క్లెయిమ్ చేస్తున్నారని రుజువైతే భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని మరియు ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన చెప్పారు. పన్ను చెల్లింపుదారులు గతంలో దాఖలు చేసిన రిటర్న్‌లలో ఏవైనా పొరపాట్లను సరిదిద్దుకోవడానికి అప్డేట్ రిటర్న్ (సెక్షన్.139(8ఏ) సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో, ఉద్యోగులు పన్ను మినహాయింపులకు సంబంధించిన వివిధ అంశాలపై వివరణలు కోరగా, ఆదాయపు పన్ను అధికారులు వాటిని స్పష్టం చేశారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాసరావు, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# వాహనదారులు నిబంధనలు పాటించాలి

## ఎస్సై సుజన్ కుమార్

**దేవరుప్పుల, (ప్రభాత సూర్యుడు):** దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎస్ఐ సృజన్ కుమార్ మంగళవారం తమ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనాలను, కార్లను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించుకుంటూ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండేలా చూసుకోవాలని, ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్లకు తల్లి తండ్రులు వాహనాలు ఇవ్వద్దని, పరిమితికి మించిన వేగంతో వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ కానిస్టేబుల్ లు యాకేష్ భాస్కర్ లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్,(ప్రభాత సూర్యుడు):** బస్సులు, లారీలు, రైళ్ల ద్వారా నగరానికి మత్తు పదార్థాలు తరలించి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్బీనగర్ ఎస్వోటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఎస్వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను సీపీ వెల్లడించారు. రాజస్థాన్ జోథ్‌పూర్‌కు చెందిన పెయింటర్ ఓమా రామ్ అలియాస్ ఓం ప్రకాష్ (35) నల్లమందు, పాపిస్టా పౌడర్ విక్రయించేవాడు. అదే రాష్ట్రానికి చెందిన సన్వాలరామ్ (33) చందానగర్‌లో ఉంటూ రోలింగ్ షట్టర్ల కార్మికుడిగా పనిచేస్తున్నాడు,. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించే లక్ష్యంతో డ్రగ్స్ వ్యాపారి వికాస్ అలియాస్ ముఖేష్ నుంచి పాపిస్టా పౌడర్, ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. నిఘా ఉంచిన పోలీసులు.. జవహర్‌నగర్ పరిధిలోని తిమ్మాయిపల్లి శివారులో డ్రగ్స్ తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 కిలోల పాపిస్టా పౌడర్ (గసగసాల పొడి), 10 గ్రాముల ఎండీఎంఏ, 3 మొబైల్ ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సరఫరాదారుడు వికాస్ పరారీలో ఉన్నాడు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

## - అంబేద్కరా నాయకుల, అధికారుల మనసు మార్చాలి - అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్



**వనపర్తి, (ప్రభాత సూర్యుడు) :** వనపర్తి లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ వనపర్తి లోని పలు సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు సంవత్సరాలుగా వినతి పత్రాల ద్వారా విన్నవించుకున్నా వారు సమస్యలపై స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడాన్ని ఖండిస్తూ మీకు ఈ వినతి పత్రం అందిస్తున్నాము.

పాలిటెక్నిక్ కళాశాల భవనం మరమ్మత్తులు, పాత బస్టాండ్ ఓపెన్ చేసి అక్కడున్న పూల షాపు వారికి జీవనోపాధి కల్పిస్తూ. మిగిలిపోయిన రోడ్డు వెడల్పు చేయాలని, అవినీతి అక్రమాలు చేస్తున్న అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని, అప్పనంగా మున్సిపల్, మరియు హాస్పిటల్ కు సంబంధించిన పాత సామాన్లు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అఖిలపక్ష ఐక్యవేదిక పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈరోజు మీకు వినతి పత్రాన్ని సమర్పించడం జరుగుతున్నది. అలాగే వర్గ విభేదాలతో అభివృద్ధి కుంటి పడుతుందని వాటిని కూడా నివారించి ఏకతాటిపై వచ్చి అభివృద్ధికి పాటుపడాలని లేని ఎడల ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి మరియు హైకోర్టుకు పిల్ వేస్తామని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది. అన్ని కుల సంఘాలతో అన్ని పక్షాలతో మాట్లాడిన తర్వాత ఆగస్టు 15 తర్వాత నిర్ణయం తీసుకుని పై పనుల మొదలు పెట్టకుంటే ధర్నాలు దీక్షలు చేపడతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ తో పాటు టీ.జే.ఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, రాష్ట్ర తెలుగు యువత నాయకులు కొత్త గొల్ల శంకర్, సిపిఐ నాయకులు రమేష్, నాయకులు బొడ్డుపల్లి సతీష్, గౌని కాడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎ ఎస్ స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

## - స్మితా సబర్వాల్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్
## - స్మిత సబర్వాల్ పై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు
## - ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు



**వనపర్తి జిల్లా ప్రతినిధి(ప్రభాత సూర్యుడు):** ఐఏఎస్ స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంగళవారం వనపర్తి జిల్లా ఎస్పీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. స్మిత సబర్వాల్ సివిల్ సర్వీసులకు ఫిట్ నెస్ ఉన్నవారు మాత్రమే అర్హులని దివ్యాంగులు అర్హులు కారని ఆమె దివ్యాంగులపై వ్యాఖ్యలు చేయడం జరిగింది. ఈ వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామని వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు అన్నారు. ఈ సందర్భంగా కొమ్ము చెన్నకేశవులు మాట్లాడుతూ... ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని వెంటనే స్మిత సబర్వాల్ విధుల నుండి తొలగించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి, మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వికలాంగులుగా పుట్టడమే పాపమా అని ప్రశ్నించారు, జాలీ చూపాల్సిన ఐఏఎస్ అధికారి ఇలా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం.అన్నారు, బాబాసాహెబ్ అంబేద్కర్ గారు వికలాంగులు కూడా సకలాంగులతో సమానంగా బ్రతకాలని రిజర్వేషన్ ఇస్తే ఆ రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు చేస్తుంటే ఓర్చుకోలేని మీరు ఐఏఎస్ అధికారి గా పదవిలో కొనసాగే నైతిక విలువలను కోల్పోయారు. ఒకవేళ వికలాంగులకు రిజర్వేషన్ లు లేకుంటే కనీసం మనిషిగా కూడా చూసేవారు కాదన్నారు, అత్యున్నత పదవిలో ఉండి దివ్యాంగ సమాజ ఆత్మగౌరవాన్నీ దెబ్బతీసేలా ట్వీట్ చేసి, దివ్యాంగుల హక్కులకు బంగ%శీ% కలిగిస్తూ మాట్లాడిన స్మితా సబర్వాల్ గారిని వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం శిక్షించి, వెంటనే సస్పెండ్ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డి గారిని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య, ప్రతాప్ శెట్టి, శ్రీనివాసులు,కృష్ణయ్య ,గంధం లక్ష్మయ్య ,వి హెచ్ పి ఎస్ నాయకులు శివ నాయక్ ,బంజారా గిరిజన సమితి రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ పారిపోయిన ఘటన

## ఇద్దరు పోలీసుల సస్పెన్షన్

**సూర్యాపేట,(ప్రభాత సూర్యుడు):** సూర్యాపేటజిల్లా గడేపల్లి పోలీస్‌స్టేషన్‌లోపనిచేస్తున్నహెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాసులను సస్పెండ్ చేశారు. ఇటీవల గరిడేపల్లి పోలీస్ స్టేషన్లో బ్యాటరీల దొంగతనం చేస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్లో ఉంచగా అతను పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు. రెండు రోజులు అనంతరం అతను పోలీసులకు దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. దొంగపోలీస్ స్టేషన్ నుంచి పరారైన సమయంలోడ్యూటీలోఉన్న వాచ్ కానిస్టేబుల్‌తో పాటు ఇతరులను హెడ్ కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది.



# తెలంగాణపై కక్షపూరిత వైఖరి చూపిన కేంద్రం

## - బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత - ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి, (ప్రభాత సూర్యుడు) :** బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి ప్రదర్శించిందని... కేవలం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇచ్చిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు పేర్కొన్నారు. ఏపీలోని పోలవరం కు నిధులు కేటాయించినప్పుడు తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో ఎందుకు వివక్ష చూపించారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ పై నరేంద్ర మోది చూపించే కక్షపూరిత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖండిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన బడ్జెట్ కేవలం కుర్చీ కాపాడుకునేందుకే తయారుచేసినట్లు ఉందని,నిరుపేద ప్రజలకు రాష్ట్రాలకు ఉపయోగపడేలా లేదని ఆయన విమర్శించారు. బడ్జెట్ పై కేంద్రంలో నిరసన తెలిపేందుకు తెలంగాణ బిజెపి ఎంపీలు కాంగ్రెస్ ఎంపీలతో పాటు కలిసి రావాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ బీజెపి ప్రజా ప్రతినిధులు మంత్రి పదవుల కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోది వద్ద తాకట్టు పెట్టకూడదని ఆయన విమర్శించారు. ఇలాంటి కక్షపూరిత ధోరణి ఇలాగే కొనసాగితే బిజెపి కి తెలంగాణ రాష్ట్రంలో మనుగడ లేకుండా పోతుందని ఆయన అన్నారు.



# అక్రమ కబ్జాలను సహించేది లేదు

## - మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్

**దేవరుప్పుల, (ప్రభాత సూర్యుడు):** దేవరుప్పుల మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామ పరిధి జనగామ - సూర్యాపేట రహదారి పక్కన భీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన పలుకుబడితో అధికారం వర్గం మద్దతు ఉందని ఇష్టనుసారంగా కెనాల్ కాల్వను కబ్జా చేయడమే కాకుండా, కంచె నిర్మాణం చేశాడని, అదే కాకుండా రామ్మోహన్ రావు పొలంలోకి నిబంధనలకు విరుద్ధంగా తూమును కూడా అక్రమంగా పైపులు వేసి మలుపుకున్నాడని మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నారు. మంగళవారం సంబందిత నీటిపారుదల శాఖ ఏఈ విద్యాసాగర్ ను ప్రత్యక్షంగా అక్రమ నిర్మాణాలు జరిగిన చోటుకు తీసుకెళ్లి చూపించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి తోటకూరి పాండుకృష్ణ ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు భూక్యా సజ్జన్ నాయక్ నాయకులు రెడ్డిరాజుల రమేష్ దావెరా అనిల్ ఎస్టీ సెల్ యూత్ అధ్యక్షుడు గుగులోతు నరేందర్ పల్లపు రవి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్ నిమ్మల గణేష్ మాసంపెల్లి సాత్విక్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215